క్లుప్తంగా

మాజీ మంత్రి కారుమూరికి సత్కారం



కారుమూరిని సత్కరించిన యాదవ సంఘ నాయకులు

దెందులూరు: మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు శుక్రవారం పోతునూరులో యాదవ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సంఘ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు నాగన బోయిన ఉయ్యూరు, ఉక్కుసూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులు

ఉంగుటూరు: జాతీయ రహదారిపై చేబ్రోలు సెంటర్‌లో రోడ్డు దాటుతున్న వేముల ఉమా మహేశ్వరరావును మోటారు సైకిల్‌పై వెళుతున్న కోణే పవన్ బలంగా ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. హైవే అంబులెన్స్‌లో ఒకరిని, 108 వాహనంలో మరొకరి తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నారు. మోటారు సైక్లిస్టుది కైకరం కాగా నడిచి వెళ్లే వ్యక్తిది నారాయణపురం. ఘటనపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెరిగిన పూల ధరలు



బంతి పూలు

దెందులూరు: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మార్కెట్‌లో పూల ధరలు గణనీయంగా పెరిగాయి. ఏలూరు హోల్‌సేల్ మార్కెట్‌లో బంతి పూలు కేజీ రూ.250 నుంచి 300, గులాబీ, చామంతి కేజీ రూ.550 పలికాయి. జాజులు, కనకాంబరాలు, మల్లెలు వెయ్యి రూపాయలకు చేశారు. కలువ పువ్వు ఒక్కొక్కటీ రూ.40 విక్రయించారు. ప్రతి ఇంటిలోనూ హిందూ దేవాలయాలు నిర్వహించే వరలక్ష్మీ వ్రత నిర్వహణకు పువ్వులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.

డ్రైడేను ప్రతి ఒక్కరూ పాటించాలి



పందిరెడ్డిగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉంగుటూరు: డ్రైడేను ప్రతి ఒక్కరూ పాటించాలని హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మనరావు అన్నారు పందిరెడ్డిగూడెంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఖాళీ కొబ్బరి బొండాల్లో నిల్వ నీరు ఉంటే దోమలు పెరుతాయని తెలిపారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి

గణపవరం: దోమలతో రోగాలు వ్యాప్తి చెందుతాయని, వాటిని నివారించాలంటే ఇల్లు, పరిసర ప్రాంతాలు పొడిగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. శుక్రవారం పొడి వారంగా పాటించాలని, తడి ఎక్కడ ఉంటే అక్కడ దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమలతో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు వస్తాయన్నారు. కాచి చల్లార్చిన నీరు, క్లోరినేషన్ చేసిన నీరు మాత్రమే తాగాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆకుపచ్చని ఆకుకూరలు ఎక్కువగా తినాలని, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో డ్రెయిన్లు శుభ్రం చేసి మురుగు నీరు సక్రమంగా పారేలా ఏర్పాట్లు చేశారు.

సంక్షేమ చట్టంపై విస్తృత ప్రచారం

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంక్షేమ చట్టం 2007పై విస్తృత ప్రచారం కల్పించాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల మండల గ్రామ స్థాయి ఉద్యోగులు సమష్టిగా సంక్షేమ చట్టం పై ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. తల్లి దండ్రులు, సీనియర్ సిటిజన్ల బాధ్యత కుటుంబ సభ్యులు తీసుకోవాలని అలా తీసుకోకుండా నిర్లక్ష్యం వహించి వారిని కొట్టిన తిట్టిన వేధించిన సంక్షేమ చట్టం–2007 నిబంధనలు ఉల్లంఘన శిక్షలు ప్రభావంపై తెలియజేయాలన్నారు. చట్టం ప్రచారంపై నిర్లక్ష్యం లేకుండా సమావేశాలు నిర్వహించాలని తహసీల్దార్ సూచించారు.

పంటల బీమా.. రైతుకేది ధీమా?



మండలంలో అలస్యంగా వేస్తున్న వరినాట్లు



పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

- ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం మంగళం
- సర్కార్ నిర్ణయంతో బీమాకు దూరమవుతున్న రైతులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉచితంగా వర్తింపు
- పంట నష్టపోయిన రైతాంగానికి పరిహారం అందజేత

భీమడోలు: రైతుల పక్షపాతినంటూ ఎన్నికల్లో బాకా ఊదిన కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే రైతులకు మొండి చేయి చూపింది. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకానికి స్వస్తి పలికింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులపై పైసా భారం లేకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలుచేసి రైతన్నలకు ఆసరాగా నిలిచింది. ఐదేళ్లలో ప్రకృతి వైపరీత్యాల తరుణంలో పంట నష్టపోయిన రైతాంగానికి పరిహారంఅందించి వారిని ఆదుకుంది. రైతులకు ఎంతో భరోసాను ఇచ్చే ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం ఎత్తివేసి ఆ భారాన్ని రైతులపై వేసింది. దీంతో సాగు చేసే పంటల ఆధారంగా ప్రీమియాన్ని ఈ నెల 15వ తేదీలోగా చెల్లించాలని ఆదేశించింది. రైతులు సాగు చేయడమే కష్టంగాఉన్న ఈ తరుణంలో మోయలేని ప్రీమియాన్ని వారి నెత్తినపెట్టింది. ఇకపై ప్రీమియం చెల్లిస్తేనే వారికి లబ్ధి చేకూరుతుందని చెబుతుంది. కూటమి పాలనలో రైతులకు అప్పులు తప్ప ఆదాయం రావడం లేదని గగ్గోలు పెడుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ నుంచి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. అప్పటి వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం బీమా ప్రీమియం రైతుల నుంచి ముక్కు పిండి వసూలు చేసింది. రైతుల కష్టాలను చవిచూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతన్నలు ఒక్క పైసా కూడా చెల్లించనవసరం లేకుండా వారి ప్రీమియాన్ని చెల్లించింది. రైతుల పంటకు భరోసా కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత పంటల బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలని చెప్పింది.

ప్రీమియం చెల్లింపుకు ఆసక్తి చూపని రైతులు

రైతులు అప్పులు చేసి సాగు చేస్తున్న వేళ, ప్రీమియం చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఆసక్తి చూపడం లేదు. ఉంగుటూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 152 మంది రైతులు 125 ఎకరాలకు మాత్రమే ప్రీమియం చెల్లించారు. ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో 53 వేల ఎకరాల్లో వరి, మినుములు సాగు చేస్తున్నారు. వరికి ఎకరాకు సార్వాకు రూ.840, మినుములకు రూ.300 చెల్లించాలి. రైతులు బ్యాంకులు, సహకార బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నట్లయితే వారే ఎకరాకు రూ.840 చొప్పున ప్రీమియం తీసుకుంటారు. మిగిలిన వారు స్వయంగా చెల్లించాల్సిందే. రైతులు విధిగా ఆధార్, భూమి పత్రం, కౌలు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న గుర్తింపు పత్రం, పంట ధృవ పత్రం, సెల్ నంబర్, బ్యాంకు ఖాతా నంబర్లు అందించాలి.

వరికి 15 తుది గడువు



ప్రధానమంత్రి పసల్ బీమాను రైతులు చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలు ఆశించి పంట దెబ్బతిన్న తరుణంలో రైతులకు నష్టపరిహారం అందిస్తారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పంట సాగుకు బ్యాంకుల్లో రుణాలు తీసుకునే రైతులు ప్రీమియం చెల్లిస్తారు. బ్యాంకుల వద్ద రుణాలు తీసుకోని రైతులు మీసేవా కేంద్రంలో ప్రీమియం చెల్లించాలి. రైతు, పంటకు చెందిన ఆధారాలతో పాటు పంట ధృవీకరణ పత్రాలను మీసేవా కేంద్రానికి తీసుకెళ్లి చెల్లించాలి. వరికి ఈ నెల 15వ తేదీ, మినుములకు ఈ నెల ఆఖరు వరకు గడువు ఉంది.

– డాక్టర్ పి.ఉషారాజకుమారి, ఏడీఈ, భీమడోలు

ఉంగుటూరు నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం

మండలం	ఎకరాలు
భీమడోలు	12,734
ఉంగుటూరు	24,043
నిడమర్రు	3,450
గణపవరం	12,672

ఐస్ ఫ్యాక్టరీలకు రూఫ్‌టాప్ సోలార్‌తో మేలు



సమావేశం నిర్వహించిన విద్యుత్ శాఖ అధికారులు

ఉంగుటూరు: ఐస్ ఫ్యాక్టరీలకు విద్యుత్ వినియోగం తగ్గించుకొని రూఫ్‌టాప్ సోలార్ వాడుకునే పద్ధతిని అలవాటు చేసుకుంటే మేలు అని విద్యుత్ శాఖ అధికారి అంబేడ్కర్ వెల్లడించారు. ఈ మేరకు నారాయణపురంలో వీడీఎఫ్ ఐస్ ఫ్యాక్టరీ ఆవరణలో సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి కుసుమ్ పథకం, సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ఐస్ ఫ్యాక్టరీల సంఘం అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు అధ్యక్షత వహించారు. ఏడీఏ రాళ్లపల్లి భీమేశ్వరరావు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఐస్ ఫ్యాక్టరీల యజమానులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి: పెదవేగి మండలంలోని గుడిగుంట సబ్ స్టేషన్ నుంచి ముందూరుకు వెళ్లే లైన్ ఆర్‌డీఎస్ఎస్ పథకంలో కొత్త లైన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పనుల నిమిత్తం ఈ నెల 9వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 3 నుంచి10 గంటలవరకు, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. అదే విధంగా కొప్పాక సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఆయన తెలిపారు.

వేగం వద్దు.. ప్రాణం ముద్దు



జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌ను పరిశీలిస్తున్న సీఐ విల్సన్, ఎస్సైలు, హైవే ఇంజనీర్, ఎంవీఐలు

భీమడోలు: వేగం వద్దు.. ప్రాణం ముద్దు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ తమ గమ్య స్థానాలకు అరగంట అలస్యంగా వెళ్లినా ఎటువంటి నష్టం ఉండదని సీఐ యూజే విల్సన్ అన్నారు. జాతీయ రహదారిపై భీమడోలు సర్కిల్ పరిధిలో ప్రమాదాలకు కారణమైన బ్లాక్ స్పాట్లును గుర్తించిన పోలీస్ యంత్రాంగం జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా భీమడోలు, ద్వారకాతిరుమల ఎస్సైలు వై.సుధాకర్, సుధీర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రజ్ఞా, హైవే ఇంజనీర్ నాగేశ్వరరావులతో కలిసి ఆయన గుండుగొలను, సూరప్పగూడెం, అంబర్‌పేట, భీమడోలు, పాతూరు, కురెళ్లగూడెం, పూళ్ల తదితర బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. ఇక్కడ ఇంజనీరింగ్ లోపాలు అసమాన ఉపరితలాలు, డివైడర్లు లేకపోవడంతో తదితర అంశాలు ప్రమాదాలకు కారణంగా గుర్తించారు. ప్రమాదాలు నివారణకు జాతీయ హైవే ఆథారిటి అధికారులతో కలిసి తగిన మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రయాణించే వాహనదారులు, వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నియమాలు, నిబంధనలను పాటించాలన్నారు. సీటు బెల్టులను ధరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



భీమడోలు: వరలక్ష్మీ అవతారంలో అమ్మవారు



గణపవరం: ప్రత్యేక అలంకరణలో కంచికామాక్షి, కనకదుర్గమ్మ

భీమడోలు: మండల వ్యాప్తంగా శ్రావణ శుక్రవారం పండుగను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసంలో వచ్చే శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భీమడోలు, గుండుగొలను, కురెళ్లగూడెం తదితర గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు చేశారు. ప్రతి ఇంటా మహిళలు వరలక్ష్మీ వ్రతం చేశారు. అమ్మవార్లను వివిధ రకాల ఫలాలతో పాటు పిండి వంటలను వండి నైవేద్యం సమర్పించారు. గుండుగొలనులోని వేంచేసియున్న శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ పూజారులు లంకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైభవోపేతంగా పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు పంచామృత, నవరసఫలాల అభిషేకాలు, వరలక్ష్మీదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు.

గణపవరంలో..

గణపవరం: మహిళలు అత్యంత ఇష్టంగా, ఎంతో పవిత్రంగా జరుపుకునే వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. గణపవరంలోని ధనలక్ష్మీఆలయం, కంచికామాక్షి,కనకదుర్గ ఆలయం, చినరామచంద్రపురంలోని కనకదుర్గ ఆలయం, భక్తులతో కిటకిటలాడాయి.

పెదపాడులో..

పెదపాడు: మండలంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు తమ ఇళ్లలో శ్రావణ మాసం పురస్కరించుని అమ్మవారిని సుందరంగా అలంకరించి పళ్లు, పలహారాలను నైవేద్యంగా సమర్పించారు. భక్తి శ్రద్ధలతో కోలాహలంగా పూజలు నిర్వహించారు.

అచ్చమ్మ పేరంటాలమ్మకు చీర, సారె



అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

దెందులూరు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గాలాయగూడెం శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మకు శుక్రవారం 108 మంది ముత్తైదువులు, గ్రామస్తులతో చీర, సారెతో పాటు 108 రకాల పిండి వంటలు అమ్మవారికి సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుమంత్ శర్మ గారి ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టుచీరలతో ప్రత్యేక అలంకరణ చేశారు. తొలుత అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ అచ్చమ్మ పేరంటాలు తల్లి ఆలయ కమిటీ సభ్యులు భక్తులు గ్రామ పొలిమేర నుంచి పూర్ణకుంభాలతో మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. గాలాయగూడెంతో పాటు సమీప గ్రామాల్లో భక్తులు శ్రీ అచ్చమ్మ పేరంటాలు తల్లి అమ్మవారికిచీరసారె సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ఆవరణలో వచ్చిన భక్తులకు పులిహోర ప్రసాదంతో పాటు సారే వితరణ చేశారు.

ఉంగుటూరులో తిరిగి ఆక్రమణలు



చేబ్రోలులో పెరుగుతున్న ఆక్రమణలు

ఉంగుటూరు: మండలంలో అన్ని శాఖల అధికారులు కలిసి ఇరిగేషన్ స్థలంలో ఆక్రమణలు ఎట్టకేలకు ఆరు నెలలు శ్రమించి తొలగించారు. కోర్టు ఆదేశానుశారం ఈ ఆక్రమణలు తొలగించారు. జాతీయ రహదారి వెంబడి 463 ఆక్రమణలు ఉంగుటూరులో 130, కైకరంలో 133, చేబ్రోలులో 34, బాదంపూడిలో 20, వెల్లమిల్లిలో 6, నారాయణపురంలో 138 ఆక్రమణలు ఆరు గ్రామాల్లో ఉండేవి. ఆక్రమణలు అన్నీ ఇరిగేషన్‌కు చెందిన స్థలంలోనే ఉండేవి. ఏలూరు గోదావరి కాలువ గట్టుకు చెందిన ఇరిగేషన్ స్థలంలో విస్తరించాయి. ఇరిగేషన్ అధికారులు నిద్ర మత్తులో ఉండబట్టే అన్ని ఆక్రమణలు పెరిగిపోవడానికి కారణం. దీనికి తోడు రాజకీయ నాయకలు సపోర్టుతో ఇరిగేషన్ స్థలాల్లో ఆక్రమణలు పెరిగిపోయాయి. ఈ ఆక్రమణలు అన్నింటిని ఎంపీడీవో రాజ్ మనోజు, తహసీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో తీయడానికి రెండేళ్ల పైనే పట్టింది. సుమారు ఆరు నెలల కసరత్తు తరువాత ఆక్రమణలు తొలగించారు. కాని ఇప్పటికీ ఇరిగేషన్ అధికారులు ఆ స్థలాలను కాపాడుకునే ప్రయత్నాలు చేయడం లేదు. కాని ఆ ఇరిగేషన్ స్థలంలో పెరిగిన చెట్టు గాని, ఇతర ఆదాయం వచ్చేవి మావేనంటూ దొంగచాటుగా అమ్మేసి సొమ్ములు చేసుకుంటారు. ఇలా ఈ తంతు సాగుతోంది. ఆక్రమణలను అతికష్టం మీద తొలగించి అప్పజెప్పినా చివరికి ఇరిగేషన్ అధికారులు ఆక్రమణలు ఆపే చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ఆక్రమణలు మళ్లీ మొదలు పెట్టారు. ఉంగుటూరు, చేబ్రోలు,నారాయణపురం, కైకరం వెంబడి ఇరిగేషన్ స్థలాల్లో ఆక్రమణలు వెలుస్తున్నాయి. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ సుధారాణిని ప్రశ్నించగా ఈ ఆక్రమణలు తొలగించడానికి ప్రయత్నాలు చేసి తొలగిస్తూనే ఉన్నాం. కాని కొందరు ఎంత చెప్పినా తొలగించడంలేదు. తిరిగి కొందరు వేస్తున్నారు. ఎంత చెప్పినా వినడంలేదు. వీరిపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ సుధారాణి తెలిపారు. అలాగే ఇరిగేషన్ స్థలాలు రక్షించేందుకు కార్యచరణ చేపడతామని వివరించారు. మా ఇరిగేషన్ స్థలాలను తాము రక్షించే ప్రయత్నం చేస్తామని వివరించారు.

జాతీయ సదస్సులో పాఠశాల టీచర్



రాజస్థాన్ సదస్సులో సర్టిఫికెట్ అందుకుంటున్న టీచర్ అప్పారావు

ఉంగుటూరు : నారాయణపురం హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న ఎస్.అప్పారావుకు ఉభయగోదావరి జిల్లాల నుంచి జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం దక్కింది. ఈయన రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో సీసీఆర్‌టీలో జూలై 16 నుంచి అగస్టు 5 వరకు నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. ఇంటిగ్రేషన్ ఆఫ్ ఆర్ట్ అండ్ కల్చర్ ఇన్ నెప్ 2020 అవగాహన సదస్సులో పాల్గొని తన వాయిస్‌ను వినిపించారు. ఏపీ రీజినల్ కంట్రిబ్యూషన్ జాతీయ వేదికలో ప్రధాన భూమిక పోషించారు. ఈయన నేతృత్వంలో జాతీయ వేదిక మీద ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక కార్యక్రమాలకు విశేష ఆదరణ లభించింది. ఈ సదస్సులో ఆయనకు సర్టిఫికెట్ అందజేశారు.

అధిక రక్తపోటుపై అవగాహన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దెందులూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు వైద్యశాఖ సూచనలు, సలహాలు పాటించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వినయ్ అన్నారు. దెందులూరులో ఆయుష్మాన్ ఆరోగ్యం వద్ద అధిక రక్తపోటుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రతి రోజూ వ్యాయామం చేయాలన్నారు. ఆహారంలో ఉప్పు, నూనె వాడకాన్ని తగ్గించాలని సూచించారు. రోజు వారి పని ఒత్తిడి తగ్గించుకోవడం ద్వారా అధిక రక్తపోటును నివారించవచ్చు అన్నారు. ఇటువంటి అనారోగ్యం లక్షణాలు గుర్తించిన నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వం వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

పెదవేగి: కోడి పందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు 11మందిని అరెస్ట్ చేశారు. పెదవేగి మండలం రాయన్నపాలెంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో 11 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.24,480 నగదు, 3 పందెం కోళ్లు, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.రామకృష్ణ చెప్పారు.

జోరుగా రాఖీల విక్రయం



దెందులూరు: గ్రామాల్లో రాఖీల విక్రయం జోరుగా సాగుతోంది. ఈ నెల 9న రాఖీ పండుగ కావడంతో షాపులు పోటీ పడి నాలుగు రోజుల నుంచి రకరకాల మోడళ్ల రాఖీలను విక్రయిస్తున్నారు. రూ.20 నుంచి రూ.2 వేల వరకు రాఖీలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి.